తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 28- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 24 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




# ఉపాధి చట్టంపై తెలంగాణ పోరు

- కేంద్ర ప్రతిపాదనకు తీవ్ర వ్యతిరేకం
- అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- జూలై 2న కేబినెట్ నిర్ణయం

హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీ-జీ రామ్-జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రాష్ట్రాల రాజ్యాంగబద్ధ అధికారాలను హరించే ప్రయత్నమని, తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ ప్రభుత్వం ఒప్పుకోదని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# చిన్నారుల జీవితాల్లో కొత్త వెలుగు

- ఆశ నింపుతున్న నెబర్‌హుడ్ కేంద్రాలు
- వికలాంగ చిన్నారులకు ఉచిత సేవలు
- తల్లిదండ్రుల భావోద్వేగ అనుభవాలు

**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

వికలాంగ చిన్నారుల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతున్న నెబర్‌హుడ్ కేంద్రాలు తెలంగాణలో వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు ప్రస్తుతం 26 జిల్లాల్లో పనిచేస్తూ దాదాపు 3 వేల మంది చిన్నారులకు ఇంటి వద్దనే పునరావాస సేవలు అందిస్తున్నాయి. మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఉచితంగా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి సేవలు అందుతున్నాయి.

మిగతా 2లో





# ఏడు రోజులపాటు వర్షాలే

- రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక
- హైదరాబాద్‌లో భారీ వర్ష సూచన

**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఊరట కలిగించే వార్త చెప్పింది.

మిగతా 2లో

# వరదలపై ముందస్తు సన్నద్ధత

- శాఖలన్నీ అప్రమత్తంగా ఉండాలి
- పుష్కరాలపై ప్రత్యేక దృష్టి
- జిల్లాను సుందరంగా తీర్చిదిద్దాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

2లో









తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఉపాధి చట్టంపై తెలంగాణ పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇది కేవలం ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన సవరణ కాదని, దేశ సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని విమర్శించారు. గ్రామీణాభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను నిర్వీర్యం చేసి అధికారాలను కేంద్రీకరించాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆరోపించారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చట్టాన్నీ ప్రభుత్వం అమలు చేయబోదని స్పష్టం చేశారు.



ప్రతిపాదిత చట్టంలోని పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కాపాడేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికైనా వెనుకాడబోమని పేర్కొన్నారు. తెలంగాణ ఒక్కటే కాకుండా సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. కర్ణాటక, కేరళ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి న్యాయ, రాజకీయ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రాల అధికారాలను కాపాడేందుకు అవసరమైతే సంయుక్తంగా ఉద్యమించేందుకు కూడా సిద్ధమని పేర్కొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల హామీ ఉపాధి కల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు అమలు చేయాలని వారు సూచించారని చెప్పారు. తెలంగాణకు ప్రత్యేక ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలన్న ప్రతిపాదన కూడా సమావేశంలో వచ్చినట్లు వెల్లడించారు.

కేంద్రం ప్రతిపాదించిన నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే ప్రమాదం ఉందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని, అవసరమైతే రాష్ట్ర చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి కార్యాచరణ చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# ఏడు రోజులపాటు వర్షాలే

(మొదటి పేజీ తరువాయి)

రుతుపవనాలు తాజాగా చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో రానున్న ఏడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో రైతులు, ప్రజల్లో ఆనందం నెలకొంది.



వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం శనివారం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడవద్దని, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, పంటలను రక్షించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కూడా సూచనలు జారీ చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో తెలంగాణకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జులై 2 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కొనసాగనున్నట్లు అంచనా వేసింది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల అతి భారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది. అయితే దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురిసే సూచనలు ఉన్నాయని వెల్లడించింది. రాజధాని హైదరాబాద్‌లో కూడా వాతావరణంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా ఉండటంతో నగరవాసులు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. మధ్యాహ్నం తర్వాత చిరుజల్లులు ప్రారంభమై, సాయంత్రం తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, నాలాలు పొంగిపొర్లడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాలు చేసే వారు వాతావరణ పరిస్థితులను తెలుసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ, మున్సిపల్, విద్యుత్, వైద్య శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# వరదలపై ముందస్తు సన్నద్ధత

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):

గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు పూర్తిస్థాయిలో ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, గోదావరి వరదల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి వరదల సన్నద్ధత సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.




సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వరదల సన్నద్ధతలో భాగంగా జిల్లా, మండల స్థాయిలో అత్యవసర నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలు, త్వరిత స్పందన బృందాలు, వైద్య సేవలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ సేవలు, విపత్తు స్పందన బృందాలతో సమన్వయ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వరదల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించడంతో పాటు ఇతర శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వరదలతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపింగ్ మోటార్లు, పడవలు, అత్యవసర పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు ముందుగానే కల్పించాలని చెప్పారు.

2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలని మంత్రి పిలుపునిచ్చారు. భద్రాచలం-కూనవరం కరకట్ట నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు సారపాక ఐటీసీ ఈస్ట్ గేట్ వద్ద జాతీయ రహదారి ఎత్తు పెంపుపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వరదల సమయంలో ప్రజలకు నిరంతరం సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని కూడా సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్, మేయర్ మూడ్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీతక్కకు కోమటిరెడ్డి ఆహ్వానం

- నివాసానికి వెళ్లిన మంత్రి
- శాలువాతో ఘన సన్మానం
- నల్గొండ పర్యటనకు ఆహ్వానం

హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):

నల్గొండ జిల్లాలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి సీతక్కను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం సీతక్క నివాసానికి వెళ్లిన కోమటిరెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పర్యటనకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే శంకుస్థాపన కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తన నివాసానికి వచ్చిన కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. ఇద్దరు మంత్రులు కొద్దిసేపు రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. మాట్లాడిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తనకు సొంత సోదరి లాంటివారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని, నల్గొండలో నిర్వహించే కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధిలో కీలక ఘట్టమని అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని తెలిపారు.

ఆదివారం నల్గొండలో జరిగే కార్యక్రమంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.





# చిన్నారుల జీవితాల్లో కొత్త వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

ఆటిజం, మేధో వికలాంగత్వం, సెరిబ్రల్ పాల్సీ తదితర అభివృద్ధి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు సమీపంలోనే నిపుణుల సేవలు అందడం వల్ల తల్లిదండ్రులపై ప్రయాణ భారం తగ్గిందని అధికారులు తెలిపారు. క్రమం తప్పకుండా చికిత్స, శిక్షణ అందడంతో చిన్నారుల్లో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాలు అనేక కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతున్నాయని వివరించారు. రఘునాథపల్లి మండలానికి చెందిన మమత తన కుమారుడి పురోగతిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. గతంలో సాధారణ వస్తువులను కూడా పట్టుకోలేని తన కుమారుడు నెబర్‌హుడ్ కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ పొందిన తర్వాత స్వయంగా మాట్లాడటం, రోజువారీ పనులు చేసుకోవడం నేర్చుకున్నాడని చెప్పారు. జిల్లా స్థాయి క్యారమ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, అనంతరం రాష్ట్ర స్థాయిలో కూడా విజేతగా నిలవడం తమ కుటుంబానికి మరపురాని ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. రాజాపూర్‌కు చెందిన శిరీష కూడా తన కుమారుడు కృపాకర్‌లో వచ్చిన మార్పును వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఒకప్పుడు నడవలేక, స్పష్టంగా మాట్లాడలేకపోయిన తన కుమారుడు ఇప్పుడు స్వయంగా నడుస్తూ, స్పష్టంగా మాట్లాడి సాధారణ పిల్లల మాదిరిగానే పాఠశాలకు వెళ్తున్నాడని తెలిపారు. ఈ మార్పు తమ కుటుంబానికి కొత్త జీవితాన్ని ప్రసాదించిందని, భవిష్యత్తుపై విశ్వాసాన్ని పెంచిందని అన్నారు. నెబర్‌హుడ్ కేంద్రాలు వికలాంగ చిన్నారులకు వైద్య సేవలు మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, స్వావలంబన, సమాజంలో సమాన అవకాశాలను కూడా అందిస్తున్నాయని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు ఇంటి సమీపంలోనే నాణ్యమైన పునరావాస సేవలు అందించడం ద్వారా వేలాది చిన్నారుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కేంద్రాల సేవలను మరింత విస్తరించి ఎక్కువ మంది చిన్నారులకు చేరవేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

- లబ్ధిదారులకు గృహ ప్రవేశం
- మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం
- నూతన వస్త్రాల పంపిణీ

ఆదిలాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాలను శనివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఆదిలాబాద్ పట్టణంలోని 23వ వార్డు తాటిగూడలో లబ్ధిదారులు డోమటి లావణ్య, వాంఖడే తానుబాయి-మాధవ్ దంపతులు నిర్మించుకున్న నూతన గృహాలను మంత్రులు ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా మంత్రులు లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వారికి భద్రమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. గృహ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి మరిన్ని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.


ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరేలా జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని అధికారులు పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ ప్రక్రియలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కల నెరవేరుతోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# హుజూరాబాద్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం

- ప్రజల సహకారం కోరిన ఎన్నికల అధికారులు

**హుజూరాబాద్, జూన్ 27(తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (Special Intensive Revision SIR) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించే లక్ష్యంతో ఈ ప్రక్రియను చేపట్టారు.

నియోజకవర్గ పరిధిలోని 52 పోలింగ్ బూత్‌లలో బూత్ స్థాయి అధికారులు (BLOలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన వారి పేర్లను నమోదు చేయడం, చిరునామా మార్పులు, పేరు సవరణలు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలను నిర్వహిస్తున్నారు.



ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డులో లేదా జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సంబంధిత బీఎల్‌వోను సంప్రదించి సవరించుకోవాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలు అవసరమైన సమాచారం, పత్రాలను అందించి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ఖచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధమవుతుందని అధికారులు తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎన్నికల అధికారులు పిలుపునిచ్చారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- మోజర్ల సర్పంచ్ చంద్రశేఖర్

**పెద్దమందడి,జూన్27(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సర్పంచ్, బీఎల్‌వో చంద్రశేఖర్ కోరారు. శనివారం మోజర్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



అలాగే ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, చిరునామా మార్పు, ఇతర వివరాల సవరణలు అవసరమైన వారు ఈ ప్రత్యేక కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ శారద , గట్టు మన్నెం, నరసింహా, కొండన్న గ్రామ ప్రజలు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల ఉద్యమ సేవకు దక్కిన గుర్తింపు

**జమ్మికుంట టౌన్ జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండల సీపీఎం పార్టీ కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జక్కుల రమేష్ యాదవ్‌కు జమ్మికుంట మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు సింగవేనా ఓదెలు యాదవ్ శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా కార్మికునిగా, కార్మిక సంఘం నాయకునిగా జక్కుల రమేష్ యాదవ్ నిరంతరం కార్మికుల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగే ఉద్యమాల్లో ముందుండి పోరాడుతున్నారని కొనియాడారు. అలాంటి ఉద్యమ నాయకుడిని సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా ఎన్నుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు.



నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మరింత ఐక్యంగా ఉద్యమాలను ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పల్లెబోయిన రాజు, సంపత్ యాదవ్, తెడ్ల ఓదెలు యాదవ్, శ్రీనివాస్, దండిగారి సతీష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకు చెక్.. పచ్చదనానికి శ్రీకారం!

**జమ్మికుంట టౌన్ జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చెత్త చెదారం వేస్తున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ మొక్కలు నాటించడం ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశుభ్రతపై అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. జమ్మికుంట పట్టణంలోని 30వ వార్డు పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో చెత్త వేస్తున్న ఖాళీ స్థలంలో స్థానిక మహిళలతో కలిసి మొక్కలు నాటిన చైర్మన్, ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి వార్డులో చెత్త సేకరణ కోసం సూపర్ క్యారీ వాహనాలు, ప్రధాన రహదారులపై ట్రాక్టర్లు నిరంతరం తిరుగుతున్నప్పటికీ కొందరు ప్రజలు రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు.




వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకే అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, అంటువ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. చెత్త వేసే ప్రాంతాలను పచ్చని మొక్కలతో అందంగా తీర్చిదిద్దడం ద్వారా అలాంటి అలవాట్లకు స్వస్తి పలకాలని మున్సిపాలిటీ సంకల్పించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పల్లా నారాయణ, కటకం సంపత్, లెంకలపల్లి శరత్, వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మహతి వేదికపై అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

**వనపర్తి,జూన్27(తెలంగాణ ముచ్చట్లు):** తిరుపతిలోని శ్రీ మహతి ఆడిటోరియంలో స్వామివారి దివ్య సన్నిధిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో సాత్విక కూచిపూడి అకాడమీ' విద్యార్థులు తమ అద్భుత కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. అకాడమీ అధినేత, ప్రముఖ నృత్య గురువు సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలు నయనానందకరంగా సాగాయి.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రాంతానికి చెందిన అకాడమీ విద్యార్థులు స్పందన, అన్విక, ప్రణస్వి, ఆరాధ్య, శ్రీనిధి, వారుణి, భావిత, విద్యా హారిణి, జ్యోష్ణ తదితరులు కూచిపూడి నృత్యంలోని లాస్యభావాలు, హావభావాలు, సంప్రదాయ నృత్య భంగిమలను అద్భుతంగా ఆవిష్కరించి భక్తులను, కళాభిమానులను ముగ్ధులను చేశారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఆలయ అధికారులు, భక్తులు వారికి శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.భారతీయ సాంప్రదాయ కళలను భావితరాలకు చేరవేయడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.





## ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ కొత్త సారథి ముప్పు శ్రీనివాస్‌కు ఘన సన్మానం

- ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం
- పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు

**ఎల్కతుర్తి, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బీరన్న గుడి సమీపంలో శనివారం ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమితులైన ముప్పు శ్రీనివాస్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువా కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటూ గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ మాట్లాడుతూ, ముప్పు శ్రీనివాస్ నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాన్ని సాధించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య, డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, శనిగరపు వెంకటేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర రావు, మాజీ సర్పంచులు గొడిశాల యాదగిరి, నల్లాల రాజిరెడ్డి, లోకిని సూరయ్య, బొజ్జ గోపాల్, కాంగ్రెస్ యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్, కోరే పున్నం, జనగాని లక్ష్మీనారాయణ, అంబాల జగన్, గొడిశాల వినయ్, ప్రదీప్, రమేష్, వెంకట్, యువరాజ్, నాగరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు, రజక సంఘం నాయకులు, యూత్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

**మంచిర్యాల, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** మందమర్రి పట్టణంలో శనివారం ఉదయం జాతీయ రహదారిపై పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలలో రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను ఆపి విచారించగా వారి వద్ద నుండి సరైన లేబుల్స్, బిల్లులు లేని సుమారు 100 కేజీల విడి నకిలీ పత్తి విత్తనాలతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు, అధిక ఆదాయమే ధ్యేయంగా రైతులను మోసం చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని పేర్కొన్నారు, నిందితులకు ఈ విత్తనాలు ఎక్కడి నుండి వచ్చాయనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు, నకిలీ పత్తి విత్తనాల అక్రమ రవాణాపై ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు, ఈ ఆపరేషన్ లో పాల్గొన్న కానిస్టేబుళ్లు శ్రీనివాస్, చైతన్య, రాకేష్, మహేందర్, సంతోష్‌లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.



## వేలేరు మండలంలో డిప్యూటీ కలెక్టర్ ట్రైనీ రోహిత్ క్షేత్రస్థాయి పర్యటన

**వేలేరు, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** మండల శిక్షణ కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) ఎన్. రోహిత్ శనివారం వేలేరు మండలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి, ఎంపీడీవో జి. కిషన్‌తో కలిసి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశమై పలు అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

తర్వాత మండల కేంద్రంలోని రైతు ఆయిల్ పామ్ కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం నిర్వహణ విధానం, ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహక కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.

మండల స్థాయిలో అమలవుతున్న పరిపాలనా విధానం, అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సంక్షేమ పథకాల అమలుపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించుకోవడమే ఈ శిక్షణ పర్యటన ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హెలెన్ కెల్లర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం




- **దమ్మపేటలో జయంతి వేడుకలు.**
- **చిత్రపటానికి నివాళి.**

**దమ్మపేట, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో మదర్ థెరీసా దివ్యాంగుల పునరావాస సేవల కేంద్రంలో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. మండల సమాఖ్య ప్రతినిధులు, గ్రామ సంఘాల సభ్యులు, వివిధ గ్రామాల దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్ జీవిత విశేషాలను, దివ్యాంగుల హక్కులు, సంక్షేమం కోసం ఆమె చేసిన కృషిని వక్తలు వివరించారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమించి ప్రపంచవ్యాప్తంగా దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచిన హెలెన్ కెల్లర్ సేవలను కొనియాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాట, వినికిడి లోపంతో పాటు దృష్టిలోపం ఉన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, వారి ప్రతిభను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు, గ్రామ సంఘాల ప్రతినిధులు, దివ్యాంగుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

- **ఐదేళ్లలోపు చిన్నారులే లక్ష్యం**

**హుజూరాబాద్, జూన్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదేళ్లలోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. సమీపంలోని పోలియో బూత్‌లకు చిన్నారులను తీసుకెళ్లి తప్పనిసరిగా చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రభుదాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, హుజూరాబాద్ డివిజన్‌లోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం డివిజన్ వ్యాప్తంగా మొత్తం 180 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఇటుక బట్టీలు, రాతి క్వారీలు, వలస కూలీలు నివసించే 18 సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను నియమించి, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు మిస్ కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. డివిజన్ పరిధిలో ఐదేళ్లలోపు వయస్సు గల 17,472 మంది అర్హులైన చిన్నారులకు నూరు శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రణాళికలు రూపొందించినట్లు డా. ప్రభుదాస్ తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. పోలియోను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి సమయానికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని అధికారులు, మిట్టపల్లి సురేందర్ కోరారు.

# భద్రత ప్రశ్నార్థకం.. పీచరలో సీసీ కెమెరాల కోసం ప్రజల డిమాండ్!

**వేలేరు, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలో తరచూ దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇప్పటికీ సీసీ కెమెరాలు లేని గ్రామంగా పీచర నిలవడం గమనార్హం. ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో గ్రామ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

గ్రామంలో నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రత కోసం తక్షణమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రాణాలతో చెలగాటం- పీచరలో

# స్టోన్ క్రెషర్లతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

**వేలేరు,జూన్27(తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు మండలం పీచర గ్రామంలో స్టోన్ క్రెషర్ల కార్యకలాపాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రెషర్ల నుంచి ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళితో గ్రామమంతా కాలుష్యానికి గురవుతోంది. రోడ్లపై పేరుకుపోతున్న కంకర, దుమ్ము వల్ల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.క్రెషర్లకు సంబంధించిన టిప్పర్ లారీలు అధిక లోడుతో నిరంతరం రాకపోకలు సాగించడంతో గ్రామ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. అనేక చోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. కెనాల్ సమీపంలోని వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది.

దుమ్ము నియంత్రణ కోసం రోడ్లపై నీరు చల్లుతున్నప్పటికీ, అదే రహదారులు బురదమయంగా మారి ప్రజలకు మరో సమస్యగా మారింది. రోడ్డు పక్కన నివసించే కుటుంబాలు, వ్యాపారులు దుమ్ము, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్టోన్ క్రెషర్లలో జరుగుతున్న బ్లాస్టింగ్ ప్రభావంతో సమీపంలోని బావులు, బోరు బావులపై ప్రభావం పడిందని రైతులు చెబుతున్నారు. పంటలపై దుమ్ము పేరుకుపోవడంతో దిగుబడులు తగ్గి వ్యవసాయం నష్టాల్లోకి వెళ్లిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.









# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పలహారం బండి ఊరేగింపు

**హుజురాబాద్, జూన్ 27(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని పాతవాడలో చీకట్ల ఫ్యామిలీ ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పలహారం బండి ఊరేగింపును అత్యంత వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తుల జైజైధ్వానాలు, సంప్రదాయ కళారూపాల మధ్య సాగిన ఈ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి శ్రీ రౌంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలహారం బండి ఊరేగింపులో పాల్గొని భక్తులతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పాతవాడ వీధుల గుండా సాగిన పలహారం బండి ఊరేగింపులో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు సమర్పించగా, యువత డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఊరేగింపును తిలకించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సొల్లు సునీత, తాళ్లపల్లి రమేష్, గోస్కుల రాజ్‌కుమార్, గౌడ సంఘం నాయకులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల పలహారం బండి ఊరేగింపు హుజురాబాద్ పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

# ప్రతి లబ్ధిదారునికీ పథకాలే లక్ష్యం

**సూర్యాపేట, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి, మార్కెటింగ్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్రమోహన్ సూచించారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం" సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లాలో అమలవుతున్న పథకాల పురోగతిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించిన సురేంద్రమోహన్, 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులకు భూసార పరీక్షలపై విస్తృత అవగాహన కల్పించాలని, సన్న వడ్ల విత్తనాల పంపిణీ, ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రైతులు వ్యవసాయ సంబంధిత సమాచారం, యూరియా యాప్ వినియోగం, ఇతర సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నంబర్ 18001237157ను వినియోగించుకోవాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రతి వారం హాస్టళ్లను సందర్శించి ఫ్యాన్ల మరమ్మతులు, చెప్పులు, ఇతర కనీస అవసరాలు వంటి సమస్యలను బడ్జెట్‌తో సంబంధం లేకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కేవలం నిత్యకృత్యాలకే పరిమితం కాకుండా ప్రజలకు గరిష్ట ప్రయోజనం చేకూర్చే విధంగా వినూత్న ఆలోచనలతో అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి కొత్త కార్యక్రమాలు రూపొందించడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా ఎస్పీ కె. నరసింహ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో సమన్వయంతో పనిచేసి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సమావేశంలో నిర్ణయించారు.

# అదానీ లంచం కేసులో అమెరికా కోర్టు కీలక ఆదేశాలు



భారతీయ వ్యాపార దిగ్గజం గౌతమ్ అదానీపై నమోదైన హైప్రొఫైల్ లంచం కేసులో అమెరికా కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అదానీతో పాటు ఇతర నిందితులపై ఉన్న క్రిమినల్ ఆరోపణలను తక్షణమే కొట్టివేయాలన్న అభ్యర్థనను అమెరికా ఫెడరల్ జడ్జి తిరస్కరించారు.

బ్రూక్లిన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి నికోలస్ గరాఫిస్ ఈ కేసుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, కేసును ఎందుకు ఉపసంహరించుకోవాలని అమెరికా న్యాయ శాఖ భావిస్తోందో స్పష్టమైన, పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. జులై 13 లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది.

గతంలో మే 18న దాఖలైన పిటిషన్ చాలా సంక్షిప్తంగా ఉందని, దానిలో సరైన కారణాలు లేవని న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసును డ్రాప్ చేయాలనే నిర్ణయానికి వెనుక ఉన్న ఆధారాలు, చట్టపరమైన కారణాలను పూర్తిగా వివరించాలని ఆయన సూచించారు.

ఈ కేసు 2024లో నమోదు కాగా, భారత్‌లోని భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ అధికారులకు వందల మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు, అలాగే అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించారన్న అభియోగాలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ మొదటి నుంచీ ఖండిస్తోంది.

ఇటీవల అదానీ తరపు న్యాయవాదులు కూడా ఈ కేసు అమెరికా పరిధిలోకి రాదని, తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేయాలని కోర్టును కోరారు. అయితే తుది నిర్ణయానికి ముందు పూర్తి వివరణ అవసరమని కోర్టు స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా, ఈ కేసుతో సమాంతరంగా నడుస్తున్న సివిల్ వివాదాల పరిష్కారానికి అదానీ గ్రూప్ అంగీకరించింది. గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ నిర్దిష్ట మొత్తంలో సెటిల్‌మెంట్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఇతర నియంత్రణ సంబంధిత అంశాలపై కూడా చెల్లింపులకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.



# ఫోక్స్‌వ్యాగన్ భారీ లేఆఫ్స్‌కు సిద్ధం

ప్రపంచ ఆటోమొబైల్ రంగాన్ని గ్లోబల్ లేఆఫ్స్ తీవ్రంగా కుదిపేస్తున్నాయి. ప్రముఖ ఐరోపా కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ భారీ ఉద్యోగ కోతలకు సిద్ధమవుతోందన్న వార్త కార్పొరేట్ ప్రపంచంలో కలకలం రేపుతోంది.

మొదట జర్మనీలో సుమారు 50 వేల మంది ఉద్యోగులను తగ్గిస్తామని ప్రకటించిన ఈ సంస్థ, తాజా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఆ సంఖ్యను ఏకంగా లక్షకు పెంచినట్లు సమాచారం. ఖర్చులను తగ్గించుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రభావం కేవలం ఫోక్స్‌వ్యాగన్‌కే పరిమితం కాకుండా దాని అనుబంధ లగ్జరీ బ్రాండ్ ఆడీ (Audi)పై కూడా పడింది. వ్యయ నియంత్రణలో భాగంగా జర్మనీలోని మూడు ఫోక్స్‌వ్యాగన్ ప్లాంట్లతో పాటు ఒక ఆడీ ఫ్యాక్టరీని కూడా మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించినట్లు సమాచారం.

అంతర్జాతీయ మార్కెట్లలో మారుతున్న పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా విధిస్తున్న సుంకాలు (టారిఫ్స్), అలాగే చైనాకు చెందిన తక్కువ ధరల ఎలక్ట్రిక్ వాహనాల నుండి వస్తున్న తీవ్రమైన పోటీ ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు.

ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ ఒక కీలక వ్యూహాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గ్రూప్ నుండి బ్రాండ్‌ను వేరుగా చేసి స్వతంత్ర సంస్థగా మార్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ పరిణామాలు ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో పెద్ద మార్పులకు సంకేతంగా మారాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# గిగ్ వర్కర్లకు ఈఎస్ఐసీ కింద సామాజిక భద్రత విస్తరణ



భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న గిగ్ ఆర్థిక వ్యవస్థలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఫుడ్ డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు, ఫ్రీలాన్సర్లు, ఈకామర్స్ డెలివరీ సిబ్బంది వంటి వారిని ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ పరిధిలోకి తీసుకురావడానికి కేంద్రం సన్నాహాలు ప్రారంభించింది.

ఈ నిర్ణయం అమల్లోకి వస్తే అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వీరికి కూడా వ్యవస్థీకృత రంగ ఉద్యోగుల మాదిరిగానే పూర్తి ఆరోగ్య భద్రత, ఆర్థిక రక్షణ లభించనుంది.

ఈ కొత్త విధానం ద్వారా గిగ్ కార్మికులు మరియు వారి కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. అనారోగ్య సమయంలో ఆర్థిక భత్యం పొందే అవకాశం ఉండగా, మహిళా కార్మికులకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు మరియు వైద్య సౌకర్యాలు లభించనున్నాయి. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణం లేదా గాయాలు సంభవిస్తే, ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రతి నెలా పెన్షన్ రూపంలో ఆర్థిక సహాయం అందే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల రాష్ట్ర బీమా ఆసుపత్రులు మరియు అనుబంధ నెట్‌వర్క్ ద్వారా ఈ సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. దీనికోసం ఇశ్రమ్ పోర్టల్ డేటాను డిజిటల్ ప్లాట్‌ఫామ్ కంపెనీల సమాచారంతో అనుసంధానం చేసి అర్హులైన కార్మికులను గుర్తించనున్నారు. స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబెర్, బ్లింకిట్ వంటి సంస్థలతో కేంద్రం చర్చలు జరుపుతోంది.

అయితే ఈ విధానం అమలులో కొన్ని సవాళ్లు కూడా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కంపెనీల వాటా ఎంత ఉండాలి, కార్మికుల వేతనాల నుంచి ఎంత మేర తగ్గించాలి అనే అంశాలపై స్పష్టత అవసరం ఉంది. అలాగే ఒకే వ్యక్తి పలు యాప్‌లలో పనిచేస్తే వారి పని గంటలను ఎలా లెక్కించాలి అన్నది మరో ప్రధాన సమస్యగా ఉంది. ఫ్రీలాన్సర్లు, పార్ట్‌టైమ్ కార్మికుల వర్గీకరణపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.




# డిజిటల్ సేవల పన్నుపై ట్రంప్ సంచలన హెచ్చరిక

గూగుల్, యాపిల్, మెటా, అమెజాన్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజ సంస్థలను లక్ష్యంగా చేసుకుని 'డిజిటల్ సేవల పన్ను' (డిజిటల్ సర్వీసెస్ ట్యాక్స్) విధించాలని చూస్తున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక జారీ చేశారు.

అటువంటి పన్నును అమలు చేసే ఏ దేశమైనా, ఆ దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే అన్ని రకాల వస్తువులపై తక్షణమే 100 శాతం ప్రతీకార సుంకాలు (టారిఫ్స్) విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో కలకలం రేపుతోంది.

తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో శుక్రవారం చేసిన సుదీర్ఘ పోస్టులో ట్రంప్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అనేక యూరోపియన్ దేశాలు అమెరికన్ టెక్ కంపెనీలపై డిజిటల్ సేవల పన్ను విధించేందుకు చర్చలు జరుపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "అటువంటి పన్ను విధించే ఏ దేశమైనా యునైటెడ్ స్టేట్స్‌కు ఎగుమతి చేసే తమ వస్తువులన్నింటిపై తక్షణమే 100 శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ట్రంప్ తన పోస్టులో హెచ్చరించారు.

డిజిటల్ పన్ను విధించే దేశాలతో ఉన్న వాణిజ్య ఒప్పందాలన్నీ కూడా ఈ చర్యల వల్ల పూర్తిగా ప్రభావితమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే అమలులో ఉన్నా, చర్చల దశలో ఉన్నా సరే, ఈ విధానం తక్షణమే వర్తిస్తుందని తెలిపారు. అమెరికన్ టెక్నాలజీ కంపెనీలపై విదేశాల్లో జరుగుతున్న వివక్షను అడ్డుకోవడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకుంటున్నామని ట్రంప్ చెప్పారు. అమెరికా ఆర్థిక ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైతే సుంకాలను కీలక ఆయుధంగా ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్రైమ్ డే సేల్‌కు అమెజాన్ సిద్ధం

భారతదేశంలో అమెజాన్ తన పదో ప్రైమ్ డే సేల్‌ను అధికారికంగా ప్రకటించింది. ప్రైమ్ సభ్యులకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక అమ్మకాల ఉత్సవం జూలై 4 నుంచి జూలై 6 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనుంది. ఈ సందర్భంగా వందకు పైగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఐదు వందలకు పైగా ఉత్పత్తులపై భారీ ధర తగ్గింపులు అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, ఇతర సాంకేతిక ఉత్పత్తులపై ప్రత్యేక ఆఫర్లు ఉండనున్నాయని తెలిపింది.

ఈ సేల్‌లో శాంసంగ్ గెలాక్సీ ఎస్-25 అల్ట్రా స్మార్ట్‌ఫోన్‌పై భారీ ధర తగ్గింపు లభించనుంది. ప్రస్తుతం సుమారు రూ.1.30 లక్షల ధర ఉన్న ఈ ఫోన్ సేల్‌లో లక్ష రూపాయల లోపే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అమెజాన్ వెల్లడించింది. అలాగే ప్రస్తుతం రూ.82,900 ధర ఉన్న ఐఫోన్-17పై కూడా గణనీయమైన తగ్గింపు ఉంటుందని సంస్థ ధృవీకరించింది. రెడ్‌మి టర్బో-5 స్మార్ట్‌ఫోన్‌పై కూడా సుమారు రూ.20 వేల వరకు తగ్గింపు లభించనున్నట్లు సేల్ వివరాల్లో వెల్లడైంది. దీంతో పాటు వన్‌ప్లస్-13, వన్‌ప్లస్-15ఆర్, ఐఫోన్-17 ప్రో మ్యాక్స్, ఐక్యూఓఓ-15, శాంసంగ్ జెడ్ ఫోల్డ్-7 వంటి ప్రీమియం స్మార్ట్‌ఫోన్లపై కూడా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. మధ్యస్థాయి, తక్కువ ధరల విభాగానికి చెందిన పలు మొబైల్ ఫోన్లపై కూడా ఆకర్షణీయమైన తగ్గింపులు ఇవ్వనున్నట్లు సంస్థ పేర్కొంది.

అమెజాన్ ప్రైమ్ డే సేల్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ కూడా తన ప్రత్యేక అమ్మకాల ఉత్సవాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. దీంతో వినియోగదారులకు రెండు ప్రముఖ ఈవాణిజ్య వేదికల్లోనూ భారీ ధర తగ్గింపులతో వస్తువులు కొనుగోలు చేసే అవకాశం లభించనుంది.

ప్రైమ్ సభ్యత్వం లేని వినియోగదారుల కోసం కూడా అమెజాన్ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. సాధారణంగా రూ.1,499గా ఉన్న వార్షిక ప్రైమ్ సభ్యత్వాన్ని ప్రస్తుతం రూ.999కే అందిస్తోంది. అలాగే రూ.799 ధర ఉన్న ప్రైమ్ లైట్ సభ్యత్వాన్ని రూ.599కు, రూ.399 విలువైన ప్రైమ్ షాపింగ్ సభ్యత్వాన్ని రూ.299కు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో సేల్ ప్రారంభానికి ముందే తక్కువ ధరకు సభ్యత్వం పొందే అవకాశం వినియోగదారులకు కల్పించింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వృషకర్మతో నాగ చైతన్య కొత్త ప్రయాణం - ఇప్పటికీ ఆమెతోనే బెస్ట్ కెమిస్ట్రీ..!

అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య వరుస విజయాలతో మంచి ఫామ్‌లో కొనసాగుతున్నారు. కంటెంట్ ప్రధానంగా ఉన్న సినిమాలను ఎంచుకుంటూ హిట్స్ అందుకుంటున్న ఆయన, చివరిగా విడుదలైన 'తండేల్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

ప్రస్తుతం నాగ చైతన్య పీరియాడికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు 'వృషకర్మ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. జెట్ స్పీడ్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై టాలీవుడ్‌లో మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఇదిలా ఉంటే, నాగ చైతన్య గతంలో చేసిన ఓ వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్‌గా మారింది. తన కెరీర్‌లో నటించిన హీరోయిన్లలో ఎవరి కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని అడిగిన ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేసింది.

దాదాపు 27 సినిమాల్లో, 20కి పైగా హీరోయిన్లతో నటించిన నాగ చైతన్య, ఎలాంటి తడబాటు లేకుండా హీరోయిన్ కృతిశెట్టితో కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యిందని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్య ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశంగా మారింది.

నాగ చైతన్య సాయి పల్లవి, సమంత, తమన్నా, రాశి ఖన్నా వంటి స్టార్ హీరోయిన్లతో కలిసి నటించినప్పటికీ కృతిశెట్టి పేరు చెప్పడం విశేషంగా మారింది. కృతిశెట్టితో ఆయన 'బంగార్రాజు', 'కస్టడీ' చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.



# భాగ్యరాజ్ మృతి: చిరంజీవి భావోద్వేగ నివాళి

తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ దర్శకుడు, రచయిత, నటుడు కె. భాగ్యరాజ్ ఆకస్మిక మరణం దక్షిణాది చిత్ర పరిశ్రమను తీవ్ర విషాదంలో ముంచేసింది. గుండెపోటుతో ఆయన కన్నుమూయడంతో సినీ వర్గాలు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

చిరంజీవి తన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, భాగ్యరాజ్ మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఇటీవల గోవాలో నటి ఖుష్బూ కుమార్తె వివాహ వేడుకలో భాగ్యరాజ్‌తో కలిసి గడిపిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ వేడుకలో అందరం కలిసి నవ్వుకుంటూ, సరదాగా మాట్లాడుకుంటూ ఎంతో ఆనందంగా గడిపామని, భాగ్యరాజ్ ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించారని చిరంజీవి పేర్కొన్నారు.

అలాంటి వ్యక్తి ఈ ఉదయం ఇక లేరనే వార్తను ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భాగ్యరాజ్ భారతీయ సినీ పరిశ్రమకు చేసిన సేవలు అమూల్యమని చిరంజీవి అన్నారు. అద్భుతమైన దర్శకుడిగా, ప్రతిభావంతమైన స్క్రీన్‌ప్లే రచయితగా, గొప్ప నటుడిగా ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని కొనియాడారు.

భాగ్యరాజ్ ప్రత్యేకమైన కథన శైలి, కుటుంబ కథలు, హాస్యం, భావోద్వేగాలను మేళవించే తీరు దక్షిణ భారత చిత్ర పరిశ్రమలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టిందని చిరంజీవి పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పూర్ణిమ భాగ్యరాజ్, శాంతనుతో పాటు కుటుంబ సభ్యులందరికీ ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. చివరగా భాగ్యరాజ్‌ను స్నేహితుడిగా స్మరించుకుంటూ, "నా ప్రియమైన మిత్రమా... మీ ఆత్మకు శాంతి చేకూరాలి. మీరు ఎప్పటికీ మా జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు" అంటూ చిరంజీవి భావోద్వేగ నివాళులు అర్పించారు.

# వెంకీమామ చేతిలో వరుస భారీ చిత్రాలు



టాలీవుడ్‌లో కుటుంబ కథా చిత్రాలకు చిరునామాగా నిలిచిన విక్టరీ వెంకటేష్ వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా తన నటనతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పటికీ వరుస విజయాలతో తన మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకుంటున్నారు. గత సంక్రాంతికి విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం ఘన విజయం సాధించగా, ఈ ఏడాది విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంలో ప్రత్యేక పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ రెండు విజయాల తర్వాత వెంకటేష్ చేతిలో భారీ చిత్రాలు వరుసగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుతం వెంకటేష్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నారు. కుటుంబ కథ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్రివిక్రమ్ రచన, వెంకటేష్ కుటుంబ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ కలిసి మరో విజయాన్ని అందిస్తాయనే నమ్మకం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.

ఇక 'ఎఫ్-2', 'ఎఫ్-3', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి విజయాల తర్వాత దర్శకుడు అనిల్ రావిపూడితో వెంకటేష్ మరోసారి చేతులు కలిపారు. ఈ మల్టీస్టారర్ చిత్రంలో నందమూరి కళ్యాణ్ రామ్ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో వినోదం, కుటుంబ భావోద్వేగాలకు పెద్దపీట వేయనున్నట్లు సమాచారం.

'బింబిసార'తో దర్శకుడిగా గుర్తింపు పొందిన వశిష్ట ప్రస్తుతం 'విశ్వంభర' చిత్ర పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఆ చిత్రం పూర్తైన అనంతరం వెంకటేష్‌తో కొత్త ప్రాజెక్ట్ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. వశిష్ట చెప్పిన కథ వెంకటేష్‌ను ఆకట్టుకోవడంతో ఇప్పటికే ప్రాథమిక అంగీకారం లభించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్‌తో పాటు నల్లమలుపు శ్రీనివాస్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

# 11 ఏళ్ల తర్వాత మళ్లీ కలిసిన హిట్ జోడీ



మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను అందించిన హీరో నివిన్ పౌలీ, దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రన్ మరోసారి చేతులు కలిపారు. 'నేరమ్', 'ప్రేమమ్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత దాదాపు 11 ఏళ్ల విరామం అనంతరం వీరిద్దరి కలయికలో కొత్త చిత్రం తెరకెక్కనుండటంతో సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

నివిన్ పౌలీ కెరీర్‌లో 50వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాకు 'విజయం' అనే శీర్షికను ఖరారు చేస్తూ చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. కొచ్చిలోని ప్రముఖ పద్మ థియేటర్‌లో అభిమానులు, సినీ ప్రముఖుల సమక్షంలో ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో సాగే క్రీడా ప్రధాన యాక్షన్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు వెల్లడించారు.

ఈ చిత్రానికి దర్శకుడు ఆల్ఫోన్స్ పుత్రన్ కేవలం దర్శకత్వం మాత్రమే కాకుండా కథ, కథనం, చిత్ర సంకలనం, రంగుల రూపకల్పన వంటి కీలక బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. గతంలో ప్రేమకథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ విజయవంతమైన జోడీ, ఈసారి పూర్తిగా భిన్నమైన కథాంశాన్ని ఎంచుకోవడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

'ప్రేమమ్' చిత్రం ద్వారా మలయాళ చిత్ర పరిశ్రమకు కొత్త గుర్తింపు తీసుకురావడంతో పాటు సాయి పల్లవి, అనుపమ పరమేశ్వరన్ వంటి నటీమణులను పరిచయం చేసిన ఈ కలయిక ఇప్పుడు మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. 'విజయం' చిత్రం ప్రకటనతోనే అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొనగా, ఈ చిత్రం కూడా గత విజయాల సరసన నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో..

◆పంచాయతీ కార్యదర్శి అరెస్ట్
◆ ఇంటి అనుమతికి రూ.25 వేలు డిమాండ్
◆వరంగల్ కోర్టుకు తరలింపు




**ఖమ్మం, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం భానాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్‌ను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు చేసేందుకు రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదుదారు ఇచ్చిన సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని ఈ ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడు లంచం స్వీకరిస్తున్న సమయంలోనే అధికారులు పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత పత్రాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.

అరెస్టు అనంతరం నిందితుడిని విచారించిన అధికారులు, లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా ఆయనను వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి ఎలాంటి తావు ఉండబోదని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు అందాల్సిన సేవలను అందించేందుకు లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవినీతిపై రాజీ పడకుండా నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ సేవల కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవినీతి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని ఏసీబీ పేర్కొంది. లంచం ఇచ్చే బదులు వెంటనే ఫిర్యాదు చేసి అవినీతిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని ప్రజలను కోరింది. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇటువంటి ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ఎంఎస్ఎంఈలతోనే ఆర్థికాభివృద్ధి

◆యువ పారిశ్రామికవేత్తలే కీలకం
◆ఉపాధి కల్పనపై దృష్టి
◆ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అఖిల భారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ తెలంగాణ ఎంఎస్ఎంఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానంలో కీలక భాగమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉపాధిలో 60 శాతానికి పైగా, స్థూల ఆర్థిక ఉత్పత్తిలో గణనీయమైన వాటాను ఎంఎస్ఎంఈలు కలిగి ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మూడు నుంచి ఐదుగురు ఉద్యోగులతో నడిచే చిన్న పరిశ్రమలే ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమని, మరిన్ని పరిశ్రమలు ఏర్పడితే యువతకు ఉపాధి విస్తరిస్తుందని అన్నారు.

సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చిన్న పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించడం అవసరమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల ఆశలు, సమస్యలను కాంగ్రెస్ పార్టీ దగ్గరగా తెలుసుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక వర్గాల సర్వే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు లక్ష్యిత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో ప్రాధాన్యం ఇస్తోందని ఆయన చెప్పారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వంటి మహిళా నాయకత్వాన్ని దేశానికి అందించామని గుర్తుచేశారు. మహిళలు విమానయానం, ఇంజినీరింగ్, పరిపాలన వంటి అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని, మహిళల భాగస్వామ్యం పెరిగితే దేశ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు.

తెలంగాణలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఉచిత విద్యుత్, నాణ్యమైన బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావించారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనిసెఫ్ తెలంగాణ చీఫ్ డాక్టర్ జీలాల్మన్ టఫెస్సే, టర్కియే కాన్సులేట్ కమర్షియల్ అటాషే టుగ్సే గుల్, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి. సుజాత, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎంఎస్ఎంఈల తెలంగాణ చైర్మన్ పి. శ్రీనివాస్, ఏఐపీసీ నాయకులు ఇర్ఫాన్ అజీజ్, శశాంక్ పసుపులేటి తదితరులు పాల్గొని యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి, ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.




# ఆర్టీసీ హామీలన్నీ అమలు చేస్తాం

◆కార్మికులకు మంత్రి భరోసా
◆పీఆర్సీ జూలై నుంచే అమలు
◆గుర్తింపు ఎన్నికలు త్వరలోనే



**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పూర్తి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు, ఉన్నతాధికారులు, ఆర్టీసీ యాజమాన్యం, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో దాదాపు 14 గంటలపాటు విస్తృతంగా చర్చలు జరిపి ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లను పరిశీలించగా, వాటిలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించినట్లు తెలిపారు. యాజమాన్యం పరిధిలోని అంశాల పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు.

ప్రభుత్వ పరిధిలో ఉన్న ముఖ్య అంశాలైన గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు, 2021 వేతన సవరణ, ఆర్టీసీ విలీన ప్రక్రియపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. 2021 పీఆర్సీ కింద ప్రకటించిన 11 శాతం వేతన పెంపు జూలై నెల జీతాల నుంచే అమల్లోకి వస్తుందని వెల్లడించారు. మొదట గుర్తింపు సంఘాల ఎన్నికలే ప్రధాన డిమాండ్‌గా ఉన్నప్పటికీ ఇప్పుడు కొందరు అదే అంశంపై భిన్నంగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కోసం ఏర్పాటు చేసే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అయితే ఆ ప్రతినిధులు గుర్తింపు పొందిన కార్మిక సంఘాల నుంచే ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్‌ను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు.

గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విలీన ప్రక్రియలో భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గుర్తింపు సంఘాల ప్రతినిధులను కమిటీలో చేర్చే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఎదురైన ఇబ్బందులు తెలంగాణలో పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ పరిస్థితుల్లో గుర్తింపు సంఘాల ఎన్నికలు, విలీన ప్రక్రియపై అనవసర అపోహలు సృష్టించడం తగదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలనే చిత్తశుద్ధితో పనిచేస్తోందని, కార్మికులు అసత్య ప్రచారాలను నమ్మకుండా వాస్తవాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు మరింత అండ

◆14 కేంద్రాలకు ఈ-ఆటోల పంపిణీ
◆సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం
◆హెలెన్ కెల్లర్‌కు ఘన నివాళి
◆మంత్రి సీతక్క








**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

దివ్యాంగులను జాలి చూపాల్సిన వారిగా కాకుండా సమాజ అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హెలెన్ కెల్లర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని 14 నైబర్‌హుడ్ సెంటర్లకు ఈఆటోలను పంపిణీ చేస్తూ ఆమె మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని పేర్కొన్నారు. హెలెన్ కెల్లర్ జీవితం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని మంత్రి అన్నారు. చిన్న వయసులోనే చూపు, వినికిడి కోల్పోయినా ఆమె సంకల్పబలంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారని గుర్తుచేశారు. దివ్యాంగులను జాలితో కాకుండా గౌరవంతో చూడాలని, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దివ్యాంగులకు విద్య, ఉపాధి, పునరావాసం, జీవనోపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. సెర్ప్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకుపైగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటై, 82 వేల మందికి పైగా సభ్యులు అందులో భాగస్వాములయ్యారని తెలిపారు. స్త్రీనిధి ద్వారా రూ.38.16 కోట్ల రుణాలు, మహిళా సంఘాల ద్వారా రూ.4.13 కోట్ల రుణాలు, రూ.11.62 కోట్ల పొదుపులు సమకూరగా, 2,248 మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించామని వెల్లడించారు. ప్రస్తుతం 26 జిల్లాల్లో 74 నైబర్‌హుడ్ సెంటర్ల ద్వారా దాదాపు మూడు వేల మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ప్రత్యేక విద్య, కౌన్సెలింగ్, నైపుణ్యాభివృద్ధి వంటి సేవలు అందుతున్నాయని మంత్రి తెలిపారు. తల్లిదండ్రులకు శిక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కూడా కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

ఈఆటోలు కేవలం వాహనాలు కాదని, దివ్యాంగ చిన్నారులకు ఆశ, ఆత్మవిశ్వాసాన్ని అందించే సాధనాలని మంత్రి అన్నారు. రవాణా ఇబ్బందుల కారణంగా కేంద్రాలకు తీసుకురాలేకపోయిన పిల్లలకు ఇకపై ఇంటి వద్ద నుంచే ఉచిత రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఆటిజం, మేధోవైకల్యం ఉన్న చిన్నారులు క్రమం తప్పకుండా థెరపీ పొందేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి త్రిచక్ర వాహనాలు, జీవనోపాధి అవకాశాలు, స్వయం సహాయక సంఘాలు, నైబర్‌హుడ్ సెంటర్ల వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగుడికి ఇంటి సమీపంలోనే సేవలు అందేలా నైబర్‌హుడ్ సెంటర్లను మరింత బలోపేతం చేస్తామని, అవసరమైన చోట కొత్త కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తామని ప్రకటించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# హస్మత్‌పేటలో హైడ్రా భారీ ఆపరేషన్

◆10 ఎకరాల ప్రభుత్వ భూమి రక్షణ
◆రూ.750 కోట్ల విలువైన స్థలానికి ఫెన్సింగ్
◆ఆక్రమణలకు హైడ్రా గట్టి చెక్

**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేటలో హైడ్రా శనివారం భారీ స్థాయిలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించింది. సర్వే నంబర్-1లో ఉన్న ఈ భూమి మార్కెట్ విలువ సుమారు రూ.750 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి అందిన సమాచారంతో హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో రంగంలోకి దిగి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హస్మత్‌పేట సర్వే నంబర్-1లో మొత్తం 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, కాలక్రమేణా సుమారు 98 ఎకరాలు వివిధ రూపాల్లో ఆక్రమణలకు గురైనట్లు అధికారులు వెల్లడించారు. వంద గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి విక్రయించడం, కొంతమంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వ భూమి దాదాపు పూర్తిగా ఆక్రమణకు గురైందని గుర్తించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 10 ఎకరాలను కాపాడేందుకు హైడ్రా ప్రత్యేక చర్యలు చేపట్టింది.

ఆపరేషన్ సందర్భంగా ఇప్పటికే నివాసాలు కొనసాగుతున్న ఇళ్లను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో మాత్రమే ఆక్రమణలను తొలగిస్తూ చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో భూమిని గుర్తించి, పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుని భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆక్రమణదారులు ప్రీకాస్ట్ గోడలు నిర్మించి, చిన్న గదులు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి వాటిని తమ సొంత ఆస్తులుగా చూపించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు గుర్తులు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. హైడ్రా సిబ్బంది జేసీబీల సాయంతో ప్రీకాస్ట్ గోడలు, షెడ్లు, ఇతర తాత్కాలిక నిర్మాణాలను తొలగించి భూమిని పూర్తిగా ఖాళీ చేశారు.

ప్రభుత్వ భూమిపై ఇకపై ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా మొత్తం ప్రాంతాన్ని ఇనుప ఫెన్సింగ్‌తో చుట్టుముట్టారు. అలాగే ఇది ప్రభుత్వ భూమి అని స్పష్టంగా తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూములను రక్షించడంలో ఎలాంటి రాజీ ఉండదని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ స్థలాలపై అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయించే ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలపై నిరంతర తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని పేర్కొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు

- మహేశ్వరంలో కార్యకర్తల సమావేశం
- బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్న కేటీఆర్
- ప్రభుత్వంపై విమర్శల వెల్లువ

**హైదరాబాద్, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, మహేశ్వరంలో కనిపిస్తున్న కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమనే నమ్మకం కలుగుతోందన్నారు. మహేశ్వరంలో మరోసారి సబితా ఇంద్రారెడ్డి విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరబోతోందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని, సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, కేసీఆర్ కిట్, గురుకుల విద్య, విద్యుత్ రంగం, సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతుల అభివృద్ధిలో కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దామని చెప్పారు.

రైతులకు యూరియా కొరత, రైతుబంధు అమలు, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వంద రోజుల హామీలు, మహిళలకు ఆర్థిక సాయం, రైతులకు ఇచ్చిన హామీలు అమలుకాలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఫార్మా సిటీ ప్రాజెక్టును రద్దు చేసి ఇప్పుడు అదే భూములతో కొత్త పేర్లతో ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. రైతుల నుంచి సేకరించిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని విమర్శించారు. భవిష్యత్ నగరాల పేరుతో భూములపై దృష్టి సారించిందని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు పాలనలో సుదీర్ఘ అనుభవం ఉందని, ప్రజల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, పార్టీ నాయకులు క్యామ మల్లేష్, కార్తీక్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు.



# ఐదేళ్లలో ఒకే ఒక్క రోజు మీరు రాజులు...

# మిగతా 1,824 రోజులూ బానిసలే!

ఈ దేశపు నేలపై పుట్టిన ప్రతి మనిషీ, ప్రతి పౌరుడూ గుండె మీద చేయి వేసుకుని అడగాల్సిన అసలు సిసలైన ప్రశ్న ఒకటిఉంది అసలు నేను జీవిస్తున్నానా , లేదా కేవలం బతుకుతున్నానా ? పైకి చూడటానికి ఈ రెండూ ఒకేలా అనిపించినా, వీటి మధ్య ఉన్న తేడా అగాధమంత. జీవించడం అంటే కేవలం శ్వాసించడం కాదు, అదొక సమున్నత భావన. గౌరవంగా, స్వేచ్ఛగా, సామాజిక న్యాయాన్ని ఆస్వాదిస్తూ బతకడం. మరి బతకడం అంటే? ఈ కుళ్ళిన వ్యవస్థ విసిరేసే ఎంగిలి మెతుకుల కోసం, రాజకీయ పెద్దలు గీసిన లక్ష్మణ రేఖల మధ్య, వారి స్వార్థ సామ్రాజ్యానికి ఊడిగం చేసే ఒక సజీవ సాధనంగా మగ్గిపోవడం. దురదృష్టవశాత్తూ, నేడు ఈ దేశంలో కోట్లాది మంది కేవలం కాలం వెళ్లదీస్తున్నారు, అంటే బతుకుతున్నారు తప్ప జీవించడం లేదు. ఈ చేదు నిజాన్ని అంగీకరించడానికి మనకు ఇంకా ఎన్ని దశాబ్దాలు కావాలి?మన రాజకీయ వ్యవస్థ ఏ ఆకాశం నుండో, ఊహాలోకం నుండో ఊడిపడలేదు. అది కచ్చితంగా మన సామాజిక నేల నుండే మొలిచింది. కానీ, ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఆ నేల ఏది? ఆ పునాది ఎలాంటిది? సామాజిక, సాంస్కృతిక పునాదులపైనే ఏ రాజకీయ నిర్మాణమైనా నిలబడుతుంది. కులం, మతం, భాష, ప్రాంతం ఇవన్నీ ఒకప్పుడు సమాజంలో ఐక్యతకు, ఒకరినొకరు గుర్తించుకోవడానికి మూలాధారాలుగా ఉండేవి. కానీ, నేటి కలర్ ఫుల్ రాజకీయ నేతలు వీటన్నింటినీ పదునైన ఆయుధాలుగా మార్చేశారు. ప్రజలను ఏకం చేయడానికి కాదు, వారి మధ్య శాశ్వత గోడలు నిర్మించడానికి! సమస్యలను పరిష్కరించడానికి కాదు, వాటిని మరింత జటిలం చేసి పబ్బం గడుపుకోవడానికి. ఓట్ల పంట పండించుకోవడానికి, అధికారాన్ని తమ వారసత్వ ఆస్తిగా మార్చుకోవడానికి, ప్రజాధనంతో జేబులు నింపుకోవడానికి ఈ భావోద్వేగాలను వారు ముడిసరుకుగా వాడుకుంటున్నారు.ఎన్నికలు రాగానే కులం పేరుతో ఓట్లు అడుగుతారు కానీ, క్షేత్రస్థాయిలోకి వెళ్తే అన్ని కులాల్లోనూ పేదరికం తాండవిస్తూనే ఉంటుంది. మతం పేరుతో చిచ్చు పెట్టి భావోద్వేగాల గ్రాఫ్ పెంచుతారు కానీ, ఏ మతానికి చెందిన పేద బిడ్డకూ సరైన నాణ్యమైన చదువు అందడం లేదు. ప్రాంతాల పేరుతో సెంటిమెంట్లు రగిల్చి అభివృద్ధి వాగ్దానాల వర్షం కురిపిస్తారు కానీ, ఏ ప్రాంతమైనా సమగ్రంగా, సంపూర్ణంగా వికసించిందా అంటే సమాధానం శూన్యం. ఇది కాకతాళీయం కాదు, పక్కా స్కెచ్! ప్రజలు అసలు సమస్యను చూడకుండా, తెరవెనుక ఉన్న అసలు శత్రువును గుర్తించకుండా, ప్రశ్నించే గొంతులను నొక్కేసే ఒక వ్యవస్థీకృత మాయాజాలం.చాలా మంది అవినీతిని సమాజానికి పట్టిన ఒక తాత్కాలిక వ్యాధిగా భావిస్తారు. కానీ అది తప్పు. అది వ్యాధి కాదు, ఈ దేశంలో అదొక తిరుగులేని పరిపాలనా వ్యవస్థ గా రూపాంతరం చెందింది. వ్యాధి వస్తే మందులతో నయం చేయవచ్చు. కానీ, ఈ అవినీతి సామ్రాజ్యం స్వయంగా మందులను, ఆ మందులు ఇచ్చే డాక్టర్లను, హాస్పిటళ్లను కూడా తన గుప్పెట్లోకి తీసేసుకుంది.ఒక్కసారి మన కళ్ళు తెరిచి చూస్తే, ఈ దేశంలో అవినీతి ఊబిలో కూరుకుపోని రంగం ఏదైనా ఉందా?విద్యారంగం స్కూళ్ల నిర్మాణంలో కాంట్రాక్టుల లీలలు, టీచర్ల పోస్టుల భర్తీలో లక్షల లావాదేవీలు, పేద పిల్లల మిడ్‌డే మీల్స్ నిధుల దోపిడీ, యూనివర్సిటీ సీట్ల బ్లాక్ మార్కెటింగ్ నేడు విద్య అనేది ఒక పవిత్రమైన జ్ఞాన మార్గం కాదు,



అదొక కార్పొరేట్ బిజినెస్ డీల్.వైద్యరంగం చూస్తే ప్రభుత్వ ఆస్పత్రులకు రావాల్సిన ఉచిత మందులు బ్లాక్‌లో మాయమవుతాయి, నియామకాల్లో అక్రమాలు రాజ్యమేలుతుంటాయి, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు వెలవెలబోతుంటాయి. పేదవాడు ప్రాణాలు నిలబెట్టుకోవడానికి అప్పులపాలు కావాల్సిందే.వ్యవసాయ రంగం లో విత్తనాల సబ్సిడీలు నిజమైన రైతుకు చేరవు, సాగునీటి ప్రాజెక్టులు ఎప్పటికీ అసంపూర్ణ గాథలే, రైతు బీమా సొమ్ము దళారుల జేబుల్లో మురుగుతుంది. ఫలితంగా అన్నదాత ఆత్మహత్యల శరణాలయం వైపు అడుగులు వేస్తున్నాడు.న్యాయవ్యవస్థ లో నేడు సామాన్యుడు న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కితే, తీర్పు వచ్చేసరికి అతని జీవితకాలం సరిపోవడం లేదు. లాయర్ల ఫీజులు ఆకాశాన్ని తాకుతున్నాయి. పేదవాడికి చట్టం అనేది పుస్తకాల్లోని అందమైన అక్షరమే తప్ప, ఆచరణలో అండగా నిలిచే ఆయుధం కాదుఫోర్త్ ఎస్టేట్ (మీడియా) నేడు ప్రజల పక్షాన నిలబడి నిజాన్ని నిర్భయంగా చెప్పాల్సిన మీడియా సంస్థలు, నేడు రాజకీయ పార్టీల ఊడిగంలో, బడా కార్పొరేట్ ప్రకటనల ఒత్తిళ్లలో కూరుకుపోయాయి. జర్నలిజం అనే సామాజిక బాధ్యత, పత్రికాధానెళ్ల వ్యాపార వ్యూహాల్లో కనుమరుగైపోయింది. ఇవన్నీ వేర్వేరు సమస్యలు కావు. ఇవన్నీ అవినీతి రాజకీయ వ్యవస్థ అనే ఒకే ఒక విషవృక్షం నుండి పుట్టుకొచ్చిన కొమ్మలు.నిర్మొహమాటంగా, పచ్చిగా చెప్పాలంటే ఈ వ్యవస్థ సామాన్యులను మనుషులుగా చూడటం లేదు; కేవలం వనరులు గా మాత్రమే పరిగణిస్తోంది. ఎన్నికల సమయంలో ఓటు అనే వనరు, పన్నులు వసూలు చేసేటప్పుడు ఆదాయ వనరు, ప్రభుత్వ పథకాలు డబ్బా కొట్టుకునేటప్పుడు ప్రచారార్థ వనరు. ఐదేళ్లలో కేవలం ఒకే ఒక్క రోజు మీరు రాజులు ఆ రోజే ఓటు వేసే రోజు. మిగిలిన 1,824 రోజులూ మీరు కేవలం సేవకులు, యాచకులు. దీనిని ప్రజాస్వామ్యం అందామా? ఇది ఓటు అనే ముసుగులో సాగుతున్న ఆధునిక బానిసత్వం, నిర్బంధ సేవాపద్ధతి.రాజకీయ నాయకులు ఎంత నైపుణ్యంతో, మైండ్ గేమ్‌తో మన సామాజిక గుర్తింపులను వాడుకుంటున్నారంటే కులాల మధ్య కృత్రిమ పోరాటాలు సృష్టించి ఇరువైపులా ఓట్లు కొల్లగొడతారు. మతాల మధ్య చిచ్చుపెట్టి, రాత్రికి రాత్రే తామే రక్షకులుగా అవతారమెత్తుతారు. ప్రాంతాల మధ్య అసమానతలను అలాగే ఉంచుతారు, ఎందుకంటే ఆ వెనుకబాటుతనమే వారి రాజకీయ మనుగడకు ఇంధనం. నేడు ప్రజలు చదువుకుంటున్నారు, చేతిలో గ్లోబల్ స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి, ప్రపంచాన్ని చూస్తున్నారు. కానీ, పాలకుల పొలిటికల్ నెరేటివ్స్ అందించే భావోద్వేగ మత్తులో జోగుతున్నారు. ఇది అమాయకత్వం కాదు, పాలకుల స్క్రిప్ట్ ప్రకారం సాగుతున్న ప్రణాళికాబద్ధమైన అజ్ఞానం.

అభివృద్ధి ఈ దేశంలో అత్యంత దారుణంగా దుర్వినియోగమవుతున్న, అర్థం పర్థం లేని పదం. నాలుగు లేన్ల రోడ్లు వేస్తే అభివృద్ధే, కానీ ఆ రోడ్లు ఎవరి ఫామ్‌హౌస్‌లకు వెళ్తున్నాయి? మెరిసిపోయే విమానాశ్రయాలు కడితే అభివృద్ధే, కానీ అందులో ఎంతమంది సామాన్యులు ప్రయాణించగలరు? మెట్రో రైళ్లు నడిపితే అద్భుతమైన అభివృద్ధే, కానీ రోజువారీ కూలీ ఇప్పటికీ విరిగిన సైకిల్ పైనే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణిస్తున్నాడు. గణాంకాలలో జీడీపీ పెరుగుతోంది, కార్పొరేట్ గ్రాఫ్‌లు దూసుకుపోతున్నాయి. కానీ ఆ సంపద పంపిణీ చూస్తే, కేవలం పది శాతం మంది చేతుల్లో దేశంలోని తొంభై శాతం సంపద కేంద్రీకృతమైంది. మిగిలిన తొంభై కోట్ల మంది కేవలం పది శాతం వనరుల కోసం కొట్టుకుంటున్నారు. ఇది అభివృద్ధి కాదు, వ్యవస్థాగత ఆశీస్సులతో సాగుతున్న లీగల్ దోపిడీ. ప్రభుత్వ పథకాలు ప్రకటించినప్పుడు లక్ష కోట్లు అని మైకుల్లో ఊదరగొడతారు. బడ్జెట్ నుంచి క్షేత్రస్థాయికి వచ్చేసరికి నిధులు కరిగిపోతాయి, మధ్యలో దళారులు, లీడర్ల జేబులు నిండుతాయి. చివరకు లబ్ధిదారుడి చేతికి చేరేది కేవలం పది శాతం మాత్రమే. ఇది కాకి లెక్క కాదు, ఆడిట్ నివేదికలు చెబుతున్న సత్యం. కానీ ఇక్కడ ఎవరికీ జవాబుదారీతనం లేదు, ఎందుకంటే ఆ జవాబుదారీతనాన్ని ప్రశ్నించే వ్యవస్థలన్నీ పాలకుల జేబుల్లో బందీలయ్యాయి.కేవలం రాజకీయ పార్టీని మారిస్తే ఈ రోగానికి ముక్తి దొరుకుతుందా? ఒకవేళ అదే నిజమైతే ఈ పాటికి దేశం ఎప్పుడో బాగుపడేది. గత ఐదారు దశాబ్దాలుగా ఎన్నో రంగుల జెండాలు మారాయి, ఎందరో నాయకులు సింహాసనాలు ఎక్కారు, దిగారు. కానీ అవినీతి నెట్‌వర్క్ మాత్రం చెక్కుచెదరకుండా మరింత బలీయంగా తయారైంది. ఎందుకంటే ఇక్కడ ముఖాలు మారుతున్నాయి తప్ప, వ్యవస్థ మారడం లేదు. అందుకే పరిష్కారం నాయకులను మార్చడంలో లేదు, మనం బతుకుతున్న వ్యవస్థ ను ప్రక్షాళన చేయడంలో ఉంది.తొలి అడుగు మన సమస్యలకు అసలు కారణం కులం కాదు, కులాన్ని వాడుకుని దోచుకునే పొలిటికల్ సిస్టమ్. మతం సమస్య కాదు, మతాన్ని ఓట్ల మార్కెట్‌గా మార్చే నాయకత్వం అసలు విలన్. ఈ స్పృహ ప్రజల్లో రావాలి.రెండో అడుగు ప్రజాప్రతినిధి అనేవాడు మన సేవకుడే తప్ప పాలకుడు కాదు. మన పన్నుల సొమ్ము, ప్రతి పైసా ఎలా ఖర్చు పెట్టారో నిలదీయాలి. కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేసేటప్పుడు కాదు, ప్రతి రోజూ, ప్రతి వీధిలోనూ ప్రశ్నించడం అలవాటు కావాలి. మూడో అడుగు ఒంటరిగా ప్రశ్నించే గొంతును ఈ వ్యవస్థ చాలా సులభంగా నొక్కేస్తుంది, నిశ్శబ్దం చేస్తుంది. కానీ, లక్షలాది గొంతులు ఒకేసారి న్యాయం కోసం గర్జిస్తే, ఏ నిరంకుశ వ్యవస్థా తట్టుకోలేదు, మోకరిల్లక తప్పదు.ఈ విశ్లేషణ చదివిన తర్వాత మీ రక్తంలో కాస్త కోపం ప్రవహిస్తే అది మీరు ఇంకా సజీవంగా ఉన్నారనడానికి సంకేతం. ఒకవేళ తీవ్రమైన నిరాశ ఆవహిస్తే అది ప్రస్తుత పరిస్థితిని చూసి కలగడం సహజం. కానీ, ఆ నిరాశతోనే చేతులు ముడుచుకుని కూర్చుంటే, ఈ దుర్మార్గపు వ్యవస్థ గెలిచినట్టే, మనం ఓడినట్టే.ఈ దేశంలో మార్పు అసాధ్యమేమీ కాదు. కానీ ఆ మార్పు ఎక్కడి నుంచో, పైనుంచి కార్పొరేట్ సూట్లలో రాదు, అది కచ్చితంగా ప్రజల గుండెల నుంచే, క్షేత్రస్థాయి నుంచే ఉప్పెనలా రావాలి. మిమ్మల్ని కేవలం ఓట్ల యంత్రాలుగా వాడుకుంటున్న వారి ముసుగులను తొలగించండి. మీ కులం, మతం, ప్రాంతం అనే సంకుచిత కళ్లద్దాలను పగలకొట్టండి. అసలు శత్రువు ఎవరో గుర్తించండి. అవినీతి రాజకీయాలు మీ పిల్లల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్నాయి, మీ రక్తాన్ని పిండి వసూలు చేసిన శ్రమ ఫలాన్ని దోచుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా ఇంకా నిద్రపోవడానికి మనం బానిసలమా?గుర్తుంచుకోండి.వ్యవస్థ మిమ్మల్ని ఎప్పటికీ నిద్రపుచ్చాలనే చూస్తుంది. కానీ, మీరు మేల్కొని చరిత్రను తిరగరాయాలని కాలం కోరుకుంటోంది. ఈ చారిత్రక ఎంపిక మీది కేవలం బతుకుతారా, లేదా గౌరవంగా జీవిస్తారా?

**"వ్యవస్థ మిమ్మల్ని నిద్రపుచ్చాలని చూస్తోంది, కానీ మీరు మేల్కొని చరిత్రను తిరగరాయాలని కాలం కోరుకుంటోంది. ఎంపిక మీదే,కేవలం బతుకుతారా? గౌరవంగా జీవిస్తారా?"**



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# 73 అంగన్వాడీ పోస్టుల భర్తీ

- దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల
- జూన్ 29 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మహిళా అభ్యర్థులకు అవకాశం

**జోగులాంబ గద్వాల, జూన్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** జోగులాంబ గద్వాల జిల్లాలో ఖాళీగా ఉన్న 73 అంగన్వాడీ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 64 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 9 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం గద్వాల అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 28 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 5 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి 33 ఖాళీలు ఉన్నాయి. మల్దకల్ ప్రాజెక్టులో 22 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 4 గిరిజన ప్రాంతాల అంగన్వాడీ ఆయా పోస్టులు కలిపి 26 పోస్టులు ఉన్నాయి. మానవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో 14 అంగన్వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు.

ఈ నియామకాల కోసం జూన్ 29 నుంచి జూలై 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులోపు సమర్పించిన ఆన్‌లైన్ దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. గడువు అనంతరం వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోమని పేర్కొన్నారు. అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్ నిబంధనలు, పోస్టుల వారీ వివరాలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి, అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నియామక ప్రక్రియ పూర్తిగా నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించబడుతుందని అధికారులు పేర్కొన్నారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జిల్లాలోని అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, మహిళా ఉపాధి అవకాశాలను పెంపొందించడం ఈ నియామకాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in